
# అమూల్యం

క్రైన్ కథలపోటీలో
సాధారణ ప్రచురణకు
స్వీకరించిన కథ




చొప్పదండి సుధాకర్

**'అ**నుభవం అనేది ఒక కఠినమైన ఉపాధ్యాయురాలు. అది పరీక్షపెట్టిన తర్వాత పాఠం బోధిస్తుంది'

సమయం అమూల్యమైనది, నిజమేకానీ మనిషి ప్రాణం అంతకన్నా అమూల్యమైంది. చిత్రమేమిటంటే ఇంత చిన్న విషయం కూడా నాకు సత్యం గారు పోయేంతవరకు తెలిసిరాకపోవడం! కొన్ని కొన్ని విషయాలు ఇంతేనేమో? అనునిత్యం చూస్తూ వాటి తాలూకు ఫలితాలు అనుభవిస్తోన్నా ఎప్పటికప్పుడు తాజాగా వాటిని మరచిపోతుంటాం. అటువంటి వాటిల్లో సత్యం గారి విషాదం ఒకటి.

ఉదాహరణకు కాన్సర్ రోగం ముదిరినవాడు సైతం తాను చావక తప్పదని తెల్సినా ఆ సంగతి ఎప్పటికప్పుడు మరచిపోతుంటాడు. మరుపుకొన్ని కొన్ని విషయాల్లో వరమయితే ఇంకొన్ని విషయాల్లో తీరని శాపం కూడా! సత్యంగారిని తలచుకొంటే నాకు మాత్రం మరపు శాపమేనని చెప్పుకోవాలి. ప్రభూ, నేనూ పదోతరగతి దాకా క్లాస్‌మేట్లం, ప్రభు తండ్రే సత్యంగారు. ఆయన నన్నెంతో అభిమానించేవారు. ఎంతగా అంటే చివరకు తన సొంత కొడుకు కన్నా మిన్నగా! ప్చ్..కానీ ఏం లాభం? ఆయన ఆఖరి చూపుకి కూడా నేను నోచుకోలేదు.

బతుకుతెరువు వేటలో పడి విడిపోయామేగానీ, నిజానికి ప్రభూ, నేనూ ఒకే ఆత్మగా పెరిగాము. డిగ్రీ పూర్తి కాగానే వాడేదో బ్యాంకు పరీక్షరాసి ఉద్యోగం సంపాదించుకోగా, నేనేమో ఎమ్.బి.ఎ. చేసి సొంత బిజినెస్ పెట్టుకొన్నాను. విడమరచి చెప్పాలంటే వాడి నెలజీతమంతా కలిపి నా ఒక్క రోజు ఖర్చుకూడా కాదు. అయినప్పటికీ మాస్నేహం వెంట్రుకవాసి కూడా చెక్కు చెదరలేదు వీలయినపుడల్లా కలుసుకొంటూనే ఉన్నాం. కలిసి గడిపినంత సేపు మా ఆస్తులూ, అంతస్థులు, హోదాలన్ని మరచిపోయి హాయిగా ఎంజాయ్ చేస్తాం. ఆ విషయంలో ఇరువురమూ పోటీపడతాం కూడా! అయితే తేడా అంతా ఎక్కడొస్తుందంటే నాదంతా నిక్కచ్చి వ్యవహారం. అదిమంచయినా చెడయినా చేయాలనుకొన్నది వెంటనే చేసేస్తాను. అన్నమాటకు కట్టుబడి సమయానికి విలువిస్తాను. కానీ ప్రభు అట్లాకాదు. వాడేం మాట్లాడతాడో వాడికే తెలియదు. మాట్లాడేదానికీ, చేసేపనికి అస్సలు పొంతనుండదు. అంతా డొంక తిరుగుడు వ్యవహారం, ఒక్క మాటలో చెప్పుకోవాలంటే ఇరువురం భిన్నధృవాలం, అయినా ప్రాణస్నేహితులం, చిత్రం కదూ!

అయితే సత్యంగారికి మాత్రం నాపద్ధతి, నడవడీ బాగానచ్చేవి. కొడుకంటే అస్సలు పడేదికాదు. మనిషంటే అచ్చం నాలాగే ఉండాలన్నది ఆయన గొప్పనమ్మకం. ఒకరకంగా చెప్పాలంటే ఆయన కలలపంటని నేను. నాలాంటి కొడుకొక్కడుంటే చాలన్నది ఆయన తీరని కోరిక.

అందుకేనేమో నాక్కూడా సత్యంగారంటే గొప్ప ఆరాధనా, అభిమానమూ! అటువంటి ఆత్మీయుడి మరణం నాకు అశనిపాతమే అయిందంటే ఆశ్చర్యమేమీ ఉండదు కదా! అందుకే ఆషాక్ లోంచి వారందాకా కోలుకోలేను. వారం అంటే నాడిక్షనరీలో చాలా పెద్దమొత్తం.

ఎంతపెద్దమొత్తమంటే దాదాపు ఓ పదిలక్షల నికరలాభంతో కూడిన వ్యాపార వ్యవహారాల సముదాయం!

అయితే ఒక లాభం కలిగింది

సత్యంగారి అకాలమరణంతో ఒక స్వచ్ఛమైన సత్యం తెలిసొచ్చింది. అదే సమయం కన్నా మనిషి ప్రాణమే ముఖ్యమైనదన్న చేదు నిజం! అందుకే కోట్లాదిరూపాయల బిజినెస్ ట్రాంశాక్షన్స్, వి.ఐ.పి.ల ఎంగేజ్ మెంట్స్ అన్నీ మరో 'వారం' రోజులు వొదులుకొని ఇవాళిట్లా నా సొంతవూరికి ప్రయాణమయ్యాను

ఎందుకోగానీ, ఎపుడో దాదాపు పాతికేళ్ళ క్రింద వొదిలేసి, పూర్తిగా దాని ఊసే మరచి పోయిన పుట్టిన ఊరిని, అక్కడి మనుషులని ఒక్కసారి చూడాలనే చిన్న కోరికకు ఈరోజు 'పట్టాభిషేకం' చేసేను.

ఏమయితే అదయింది. ఇక అందర్నీ కలిసే క్రమంలో జీవితాన్ని' ఫలవంతం' చేసుకో బోతున్నాను. గొప్ప సంతోషంగా ఉంది. ఎగిరి గంతెయ్యాలన్నంత హుషారుగానూ ఉంది.

ఒక వేళ నా ఊరివాళ్ళని ఇపుడు కలవక పోతే బహుశ జీవితంలో ఎపుడూ కలవ లేనేమో? ఎందుకంటే సత్యంగారి 'గుణపాఠం' చాలుకదా! ఆలోచనల్లోనే కారు ఊళ్ళోకి మలుపు తీసుకుంది.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' 'సలెంద్ర' నాపుట్టిన ఊరు! మూడుకాలాలు ఎడతెగకుండా చల్లని నీళ్ళు ఊరుతుండే డొంక ప్రాంతాన్ని చలివేంద్రం అని పిలుస్తారు. అటువంటి ఊటలు పుష్కలంగా ఉన్న చోట వెలసిన మాఊరు చలివేంద్రం. కాలక్రమంలో చలి వేంద్రం కాస్తా సలెంద్రగా రూపాంతరం చెంది ప్రస్తుతం సలెంద్రిగా స్థిరపడి పోయింది.

ఎంత బాగుండేది ఊరు! చుట్టూ దట్టమైన అడవులతో ఆకాశాన్నంటుతున్నాయా అనిపించే కొండల వరుసతో పగలే గూబగుయ్ మనే చీకటితో కలవరపరిచే పరిసరాలతో వెలిగిపోయేది. అటువంటి ఊరు ఇప్పుడు ఎట్లా మారిపోయింది? కొసప్రాణంతో కొట్టుమిట్టా డుతూ ఏదోలా దిగాలుగా ఉంది. ఎందుకో - బహుశ నాలాంటి ఒకప్పటి యువతరం తననట్లా ఒంటరి చేసి వెళ్ళిపోయినందుకు చిన్నబుచ్చుకొందేమో?

తొట్ట తొలుతగా వెంకటయ్యగారి ఇంటికి దారితీశాను. వెంకటయ్య గారంటే ఊళ్ళో ఒకప్పుడు జమీందారంతటి హోదా వెలగ బెట్టినవాడు. ఐదుగురు పంచపాండవుల్లాంటి కొడుకులు, ఐదుగురు రత్నాల్లాంటి కూతుళ్ళు! ఇంటినిండా జనం. పాడిపంటలు,డబ్బుదస్కం, పరపతి అన్నీ ఒకదాన్ని మించి ఒకటి పోటీపడే శ్రీమంతం అతడిది.

అటువంటి వెంకటయ్య ఇల్లు ఇపుడు చాలా మారిపోయింది. ఒక్క వెంకటయ్య ఇల్లేకాదు. మా వాడకట్టు మొత్తమే మారి పోయింది. కూలిపోయిన గోడలు,నిలువెత్తుగా పెరిగిన పిచ్చి మొక్కలు. పాడు బడ్డ ఇల్లు. నెర్రెలు విచ్చిన పొలాలు. ఒకప్పటి చలివేంద్రం ఆనవాలే లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఊరు ఊరంతా వల్లకాడుగా మారిపోయింది. ఇంటి పక్కనే ఉండే కుమ్మరిభూమయ్య కొలిమి, వడ్ల బ్రహ్మయ్య ధాటీ అన్నీ శిధిలమైపోయాయి. ఎంతగా ఆశపడి వచ్చానో అంతగా దిగాలు పడిపోయేను. గొప్ప ఆవేదన కలిగించే అంశం. ఒక వెచ్చని నిట్టూర్పు నాగుండెనుండి నాకు తెలియకుండానే వెలువడింది.!

అనవసరంగా ఇక్కడకొచ్చి నా సుందర స్వప్నం చెడగొట్టుకొన్నానేమో? అక్కడే ఉండి ఉంటే అదే అందమైన భ్రమలో మునిగితేలుతూ ఉండే వాన్నేమో? ఆలోచనలో పడిపోయాను.

కానీ ఈ మనుషులని చూడగలిగేవాణ్ణా? ఊహు.... ప్రతి లాభం వెనక ఒక నష్టం ఉండి తీరుతుంది. ఊరెట్లా ఉంటేనేం?

ఒకప్పటి వృద్ధ తరాన్ని కలుసుకొన్నాను కదా! పోనీలే.... ఆ సంతోషం చాలు! అసలు నేనీ ఊరు రావడంలో అర్థమూ పరమార్థం అదేకదా!

"బాగున్నావా నాయనా?" ఎవరో పలక రిస్తోంటే ఆలోచనల్లోంచి బయటపడి అటువైపు చూశాను. ఎవరో వృద్ధమాత! దాదాపు తొంభై ఏళ్ళుండి ఉంటాయి. ఊళ్ళో దిగగానే కారు సర్పంచ్‌గారింట్లో పెట్టి వారం దించిన అతిథి మర్యాదలు అవీ అందుకొని సాయంకాలం అట్లా ఆటవిడుపుగా (నిజానికి అదే పనిమీద) ఊళ్ళోకి నడిచానో లేదో మొట్టమొదటగా కుశల ప్రశ్నలడిగిన మొదటి వ్యక్తి ఈవిడ "ఎవరబ్బా?" పోల్చుకొంటూనే దగ్గరగా వెళ్ళాను

నీలమ్మ పెద్దాయా-- ఔనూ-- నీలమ్మ పెద్దాయే! నేను చిన్నగా ఉన్నప్పుడే ఆమె దాదాపు అరవయ్యేళ్ళుండి ఉండేది. అయినా ఇప్పటికీ బతికే ఉంది. పైగా చూపు ఆనుతోంది, విశేషమే--!

"ఎవరూ---నీలవ్వ పెద్దాయా?" కన్ఫర్మ్ చేసుకోవడానికన్నట్టుగా దగ్గరగా వెళ్ళి ఆరా తీశాను.

"ఔ---బిడ్డా---నువ్వు రంగడివి కదూ--?" చేయందుకొని ఆత్మీయంగా నిమిరింది.

శ్రీరంగం అనబడు బిజినెస్ టైకూన్ అయిన నేను నిలువునా ఆశ్చర్యపోయాను. ఆమె జ్ఞాపకశక్తి అమోఘం! దాదాపు మూడు దశాబ్దాల తర్వాత కూడా తొలిగా చూసి పోల్చు కోవడమంటే అదీ--ఈ వయసులోమామూలు విషయం కాదు. నీలవ్వపెద్దాయి నన్ను దగ్గరగా కూర్చో బెట్టుకొంది. అందరూ మా వింత సమాగమాన్ని మరింత వింతగా కళ్ళు చేటలు చేసుకొని చూస్తున్నారు. ఒకప్పుడంటే ఏమోగానీ, నాకిప్పుడటువంటి పట్టింపులేమీ లేవు. నిస్సం కోచంగా నేలమీదే కూర్చున్నాను.

ఇరువురి మధ్య మాటల ప్రవాహం కట్టలు తెంచుకొంది.

"అమ్మెట్లుందిరా రంగా?" ఆప్యాయంగా అడిగింది.

"అమ్మ తమ్ముడి దగ్గరే ఉంది పెద్దాయి"

"తమ్ముడేం చేస్తున్నాడురా?"

"బెంగుళూరులో ప్రభుత్వోద్యోగం--- అదే సర్కారికొలువు"

"మీరిద్దరే కదూ---" గుర్తు చేసుకొంటూ అడిగింది.

"ఆc--- ఇద్దరమే! అయితే వాడికీ నాకూ మాటలులేవు! డబ్బు విషయంలో పోట్లాట జరిగింది. మూడేళ్ళుగా నేను బెంగుళూరు వెళ్ళలేదు. వాడు హైదరాబాద్ రాలేదు.... అంతే!" పాతజ్ఞాపకాలు మనసుని మళ్ళీ

గాయపరుస్తుంటే పొడిగా బదులిచ్చాను.

"ఇవాళా రేపు అంతా అట్లాగే ఉంది నాయనా! అయినా ఇంట్లో కొట్లాటలన్నీ ఆడవాళ్ళతోనే, నా కొడుకులు ముగ్గురూ కోడళ్ళ మూలంగానే కొట్టుకొని ఇపుడు ఎవరంతట వారే వేరుగా ఉంటున్నారు. వాళ్ళూ మీలాగే ఒకే ఊళ్ళో ఉన్నా కలుసుకోరు. పొరపాటున కలుసుకొన్నా అస్సలు మాట్లాడుకోరు...." ఎంతో తెలివిగా, చక్కగా విశ్లేషించింది నిజమే! మా అన్నదమ్ముల మధ్య పోట్లాటలు కూడా అచ్చం నీలవ్వ పెద్దాయి చెప్పినట్టు గానే మొద లయ్యాయి. ఎంతయినా ఈవిడ సర్వం తెల్సిన విజ్ఞురాలు! మరో అరగంట మాటల్లోనే గడిచిపోయింది. "సర్లే--వెళ్ళొస్తా పెద్దాయి" గట్టిగా శ్వాసించి లేచాను "మంచిది నాయనా! మల్లెపుడొస్తవ్" చేయి వొదల్లేక, వొదల్లేక వొదిలి అంది.

"చెప్పలేనవ్వా! కానీ వస్తే మాత్రం, తప్పకుండా నిన్ను కలుస్తాను" స్థిరంగా అన్నాను.

"నువ్వొచ్చినా నేనుంటనా? మళ్ళొచ్చే ఏటకి మంట్లెనో ఇంట్లనో" బోసిగా నవ్వింది. గుండెల్లో చెప్పరాని విషాదమేదో సునామీలా ఉవ్వెత్తున ఎగదన్నింది. దాన్ని ఇదీ అని నిర్వచించేలోగానే కనుకొలుకుల్లోంచి రెండు 'అశ్రువులు' టప్'మని ముసలావిడ ఉడిగి పోయిన చేతులమీద పడ్డాయ్! ప్చ్---- దృశ్యాలు అలుక్కుపోతున్నాయ్ !

ఆ సాయంత్రం మరికొందరిని కలిసి సర్పంచ్ ఇంటికి తిరుగు ముఖం పట్టాను. ఆ తెల్లవారే లేచి కారుని కిష్టాపురం వైపు పరుగు లెత్తించాను. వారం రోజుల్లో వీలయినంత ఎక్కువ మందిని కలవాలికదా! అందుకే ఈ ఆతృత! అన్నట్టు కిష్టాపురంలో ఎవరుంటారో చెప్పనేలేదు కదా! కిష్టాపురంలో నాకు చిన్నప్పుడు, బడిఅంటే లాగుతడుపుకొనే రోజుల్లో చెరుకుగడలిచ్చి మరీ ఓనమాలు దిద్దించిన నారాయణ సార్! ఆయన్ని కలవాలని మనసు ఆరాటపడిపోతోంది.

☆ ☆ ☆

అనుకొన్నట్టుగా వారం రోజులు ఊళ్ళన్నీ తిరిగి బంధువులూ, స్నేహితులు, హితులూ, సన్నిహితులూ, శ్రేయోభిలాషులైన అందర్నీ గరిష్ఠంగా కలిసి తిరిగి హైదరాబాద్ ప్రయాణ మయ్యాను. మనసుకెంతో హాయిగా, జీవితంలో ఎవరూ సాధించని, అపురూపమైనదేదో సాధించిన తృప్తి చుట్టూరా అదృశ్యంగా ఆవ రించినంత ఆనందంగా, ఆహ్లాదంగా ఉంది.

అయితే ఆ ఆనందం, ఆహ్లాదం ఎంత సేపో నిలవలేదు. ఒక చేదువార్త! "సార్! మీ అమ్మగారు పోయారు. మీకోసం ఈ వార్త చేరవేద్దామని ఎదురు చూసి, చూసి, వెతికి, వెతికి వేసారి పోయామంటే నమ్మండి! కనీసం నాకయినా , మాటమాత్రమైనా చెప్పకుండా ఎక్కడికి వెళ్ళారు సార్? మీ సెల్‌కి ఫోన్ చేసీ చేసీ విసిగి చివరకు ఎటువంటి ఆచూకీ దొరక్క మొన్ననే అంత్యక్రియలు జరిపించేశాం సార్!" సిటీ శివార్లలో ప్రవేశించి సెల్ ఓపెన్ చేయగానే పి.ఎ.రాజశేఖర్ అందించిన తొలి పిడుగుపాటు వార్త ఇది.

నాకళ్ళు పచ్చబడి పోయాయి! నీలమ్మ పెద్దాయితో అన్నమాటలు గుర్తొచ్చేయి

"తమ్ముడితో పోట్లాడి మూడేళ్ళుగా బెంగుళూరు వెళ్ళడమే మానుకొన్నాను. అమ్మ అక్కడే ఉంది"

"అంటే అమ్మని చూడక మూడేళ్ళ యిందా రంగా?" నీలమ్మ ప్రశ్న

"అంతేమరి" నిర్లక్ష్యంగా నా జవాబు.

ఒక నిజం తెలిసి దాన్ని ఆచరించే లోగానే, మరో నిప్పులాంటి నిజం జీవితంలో మరచిపోలేని గుణపాఠం నేర్పింది.

బంధుమిత్రులు శ్రేయోభిలాషులు, పుట్టిన ఊరు, వాటన్నింటికన్నా ముందు బెంగుళూరు వెళ్ళి అమ్మని చూసి రావాల్సింది. ఐతే అమ్మను చూడాలంటే ముందుగా నేను తలవంచి తమ్ముడి ముందు ఓడిపోవాలి. నేను ఓడి పోవాలంటే, అంతకన్నా ముందు నా అహం ఓడిపోవాలి. నిజమే అహాన్ని గెలవని మనిషి దేన్ని గెలిచినా ఏం లాభం? సమయం కన్నా, ప్రాణం కన్నా అహం గెలవడం అతిముఖ్యం అదే అమూల్యం కూడా!

నిజమే మనిషిమనిషిలా ఉండాలి! అహం ఆవరించిందా వాడు పశువే!

నాకంటినుండి మళ్ళీ ఒక నీటిచుక్క టప్‌మని నేలరాలింది. అది అశ్రువే! కానీ

అది రూపాంతరం చెందిన అశ్రువు. దాని అసలు రూపం--- అహం---!

ఎన్ని అహాలు ధారపోసినా అమ్మను తిరిగి తెచ్చుకోగలనా? జీవితం ఎంత కఠినమైనది-- అదీ అనుభవంలాగే ముందు పరీక్ష పెట్టి తర్వాత పాఠం బోధిస్తుంది.

రామా కవితల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కవిత

## ఆకుపచ్చని భాష

ఆకాశం మెడలో
సూర్యుడు వేసిన 'వర్ణమాల'
ఏడు భాషలు మాట్లాడుతుంది
వెదురుగుండెలో
గాలి వూదిన ఊపిరికి
ప్రాణభాష తెలుసు
సంగీత భాషణం తెలుసు...
ఎవడూహిస్తాడు
నది సముద్రంతో
తన గుండె ఘోష చెప్పుకుంటుందని?
వొక్క అచ్చులు హల్లుల
సంగమమే మనిషి భాష కాదు
కన్నీటి భాష
కోటీశ్వరుడికి అర్థం కానట్టే
ఎడారి లిపి
హృదయలేమికి అబోధకం.
మూగ గుండెలో
హోరెత్తిన వాదం
కర్ణేంద్రియ ప్రమేయం లేకుండానే
అర్థమై పోతుంది
వేళ్లు మాట్లాడినప్పుడు
స్పర్శ పెదవులు విచ్చుకుంటాయి
ప్రేమ పద్యం కళ్లకే అంకితం
అమ్మ నేర్పిన తొలి పలుకు
బిడ్డల తుదిశ్వాస వరకూ
అజరామరమే !

-ఏటూరి నాగేంద్రరావు